

గురుకుల పాఠశాలలో విద్యార్థినికి సీటు

ప్రజాశక్తి - జగ్గంపేట


అంబేద్కర్ గురుకుల బాలికల వసతి గృహ పాఠశాలలో పిఠతమామిడికి చెందిన 7వ తరగతి విద్యార్థినికి సీటు లభించింది. ఉపాధ్యాయుల తప్పిదానికి అధికారులు దిగివచ్చి ఆ విద్యార్థిని చేర్చుకున్నారు. గంగవరం మండలం పిఠతమామిడికి చెందిన వాకడ అర్చన గురుకుల బాలికల పాఠశాలలో సీటు కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో స్థానిక గురుకుల పాఠశాల నుండి ఫోన్ వచ్చింది. సీటు ఇస్తామన్నారు. తీరా గురువారం వసతి గృహానికి వస్తే ఎస్‌సి విద్యార్థి అనుకుని పొరపాటున ఫోన్ చేశామని తెలిపారు. ఆ వార్తను శుక్రవారం ప్రజాశక్తితో పాటు పలు పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించారు. 7వ తరగతిలో ఆ విద్యార్థిని చేర్చుకునేందుకు చర్యలు తీసుకున్నారు.

ఒకే ఆధార్‌కు 179 విద్యుత్ సర్వీసులు

- ఇద్దరు పిల్లలకు దక్కని తల్లికి వందనం
- అధికార యంత్రాంగం నిర్లక్ష్యం

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది అనంతరం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కొంతమంది తల్లులకు అధికారుల విపరీత చర్యల కారణంగా దక్కని పరిస్థితి నెలకొంది. సామర్లకోట నాలుగో వార్డ్ కోటపేటకు చెందిన ప్రేమ్‌చాంద్, దేవి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరు ఒక రేకుల షెడ్డును అద్దెకి తీసుకొని నివాసం ఉంటున్నారు. తమ ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం మంజూరు కాకపోవడంతో మనస్తాపం చెంది వారికి చెందిన ఒకటో వార్డు సచివాలయంలో ఆరా తీశారు. ఒకటి కాదు రెండు కాదు తల్లి దేవి ఆధార్‌కు ఏకంగా 179 విద్యుత్ సర్వీసులు అనుసంధానం అయినట్లు అక్కడ సిబ్బంది సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగిన సమాధానం లేకపోవడంతో బాధిత కుటుంబం మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి



179 విద్యుత్ మీటర్లు అనుసంధానమైనట్టు చూపుతున్న సచివాలయ రిమార్కు

అప్పలకొండను ఆశ్రయించారు. ఒకే ఒక విద్యుత్ మీటర్‌తో అద్దెకుంటున్న తనకు 179 మీటర్లు ఎలా అనుసంధానం చేస్తారని బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల విపరీత చర్య కారణంగా ఈ ఏడాది తల్లికి వందనం ఇద్దరు పిల్లలకు దక్కలేదని ఆమె వాపోయారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వారం కావడంతో అధికారులు తమకు ఈ విధంగా అన్యాయం చేశారని బాధిత కుటుంబం వాపోయింది. బాధితురాలు ఇంటిని శుక్రవారం జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాలి అప్పలకొండ సందర్శించి మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా అన్యాయమన్నారు. ఆన్‌లైన్‌లో తొలగించాము వెళ్లిపోమని బాధితురాలికి చెబుతున్నారని, మీటర్లు తొలగిస్తే మాత్రం రీడింగ్ 17,754 యూనిట్లు విద్యుత్ వినియోగం చూపించడంతో పథకాలకు కుటుంబం దూరమైందని చెప్పారు. ముఖ్యంగా ఒక ఆధార్ కార్డుకు ఇన్ని సర్వీసులు ఎలా ఆన్‌లైన్ చేశారని సంబంధిత సీడింగ్ సిబ్బందిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అప్పలకొండ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. విషయంపై విచారణ జరిపి బాధిత కుటుంబానికి తల్లికి వందనం వర్తించేలా చర్యలు తీసుకోవాలని, దళిత కుటుంబాలకు అన్యాయం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో పలు ప్రాంతాలలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేదర వీధి, శోభా థియేటర్ వీధి, కబడ్డీ వీధి, మసీదు వీధి తదితర ప్రాంతాలలో ఈ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దారపురెడ్డి కుమార్, గంగపాటి పెంటయ్య, దారపురెడ్డి కృష్ణ, రొంగల సుబ్బలక్ష్మి, దారపురెడ్డి సత్యనారాయణ, నెక్కల నరసింహమూర్తి, కూనిరెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

బాలికల హాస్టల్లో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సుధా కాలనీలో ఉన్న బీసీ గర్ల్స్ సంక్షేమ హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆర్‌డిఒ కె.శ్రీరమణి అన్నారు. ఈ హాస్టల్ వార్డెన్ పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆర్డిఒ శ్రీరమణి ఆధ్వర్యంలో అధికారులు హాస్టల్ ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు హాస్టల్లో తాము పడుతున్న ఇబ్బందులు అధికారులకు తెలియజేశారు. డ్రింకింగ్ వాటర్, భోజనాలు సక్రమంగా లేవన్నారు. బాత్రూములు కూడా చాలినన్ని లేవన్నారు. కలుషిత నీటితో స్నానాలు చేయుట వల్ల చర్మవ్యాధులకు గురవుతున్నామని బాలికలు తెలిపారు. దీనిపై ఆర్డిఒ మాట్లాడుతూ విద్యార్థినులకు చర్మవ్యాధులు వచ్చాయన్నారు. వైద్యులను పంపించి చెకప్ చేయించి వైద్య సేవలు అందిస్తామన్నారు.హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత, డిటి.కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రూ.1.75 లక్షల కోట్ల అప్పు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రూ.1.75 లక్షల కోట్ల అప్పులు చేసిందని వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు ఆరోపించారు. స్థానిక లారీ యూనియన్ కళ్యాణ మండపంలో మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్ అధ్యక్షతన శుక్రవారం పార్టీ విస్తతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, మరో శ్రీలంక అవుతుందని ఆరోపించిన కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలోనే లక్షల కోట్ల అప్పులు ఎలా చేసిందని ప్రశ్నించారు. గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, బీశెట్టి అప్పలరాజు, విజనగిరి ప్రసాద్, ఓలేటి చంటిబాబు, గుమ్ములూరు వెంకటరమణ, గునుపూడి కొండబాబు కార్యకర్తలు ఉన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

హాకీ టోర్నమెంట్‌కు ప్రభుత్వోద్యోగుల విరాళం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో ప్రభుత్వం నిర్వహిస్తున్న హాకీ టోర్నమెంట్, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిమిత్తం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా శాఖ రూ.లక్షా ఐదు వేల విరాళాన్ని డిఆర్‌ఒకు విరాళంగా అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎంవిఎస్ఎన్ఎన్ జగన్నాథం, కార్యదర్శులు జె.రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు ఎ.రత్నరాజు, ఎపిడి భాను ప్రకాష్, జిఎస్‌టిఒ స్వామి, పెద్దాపురం తాలూకా అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించడంతో ప్రజలకు పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలపై అవగాహన కల్పించేలా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షోభ నివారణ కమిటీ సమావేశం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. జిల్లాలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు తీరు, ప్రమాదకర రసాయనాలు తయారీ, నిల్వల వివరాలు, ప్రమాద సంఘటనలు చోటు చేసుకునే సందర్భాల్లో పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ ఇతర వివరాలపై పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక, ఎపిఐఐసి, కార్మిక, వ్యవసాయం, వైద్య ఆరోగ్యం తదితర శాఖలతో పాటు జిల్లాలోని వివిధ ప్రమాదకర పరిశ్రమల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. జిల్లాలో ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యలను డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డివివిఎస్.నారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో పలు జిల్లాలుతో పాటు హైదరాబాద్‌లోని పరిశ్రమల్లో చోటు చేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రధానంగా 15 ప్రమాదకర పరిశ్రమలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ప్రాముఖ్యంగా ఈ పరిశ్రమలకు అనుకుని ఆవాసాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పరిశ్రమల్లో అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు అనుసరించాల్సిన విధానాలపై విస్తత అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసేలా ప్రమాదకర పరిశ్రమల్లో అలారం, సెన్సార్ వ్యవస్థ ఇతర భద్రత వ్యవస్థలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పివిఎస్.రాజేశ్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎం.శంకర రావు, పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహ నాయక్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

2003 ఉపాధ్యాయులకు ఒపిఎస్ ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి ఎపిలో సిపిఎస్ అమల్లోకి రాక ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 2003 ఉపాధ్యాయులకు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ ఎస్.వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉమ్మడి జిల్లా కన్వీనర్ కెఎస్ఎస్.జయరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 67 ఉత్తర్వులను దేశవ్యాప్తంగా ఇప్పటికే 16 రాష్ట్రాలలో అమలు చేశారని, మన రాష్ట్రంలో అమలుకు నోచుకోక పోవడం శోచనీయం అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆ ఉత్తర్వులను అమల చేసి ఎవరైతే సిపిఎస్ విధానం అమలు కంటే ముందుగా నియమితులైన 11,000 మందికి న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనకు రాష్ట్రంలో అన్ని జెఎసిల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నగేష్, చలపతి, టి.జయకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసుల రెడ్డి, ఒ.పెద్ది రాజు, సిహెచ్.లక్ష్మి పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

సుంకరపాలెం యానాం సరిహద్దులో ఉన్న డ్రెన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ అన్నారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సాయి శ్రీనివాస్, ఎఇ వెంకటరమణ, యానాం మున్సిపల్ కమిషనర్ బుద్ధ అఖిల్‌తో కలిసి ఎంపీ హరీష్ మాధుర్ శుక్రవారం సుంకరపాలెం కూడలిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, వర్తకులు, విద్యార్థులతో మాట్లాడారు. మురునీరు రోడ్లు పైకి రావడం వల్ల భరించరాని దుర్వాసనతో నిత్యం ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు. అటు యానాం వైపు నుంచి వస్తున్న డ్రెన్, ఇటు సుంకరపాలెం వైపు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలించారు. దీనికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై అధికారులతో ఆయన స్థానిక ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మోపూరి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వేగేశ్న భాస్కరరాజు తదితరులు అక్కడ పరిస్థితిని అధికారులకు, ఎంపీ, ఎంఎల్ఎలకు వివరించారు. దీనిపై అధికారులతో సమాలోచనలు చేసిన ఆయన ఆ వివరాలను మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోపూరి రెడ్డి నాయుడు, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వుంగరాల వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్, జయలక్ష్మి, చీకట్ల నాగేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు నీరును పరిశీలిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ అధికారులు

ఘనంగా సహస్ర అకాడమీ దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

వెంకట్ నగర్ సహస్ర జూనియర్ కాలేజ్ అండ్ మెడికల్ అకాడమీ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ మానేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019లో కాకినాడ నగరంలో సహస్ర కాలేజీనీ చాలా ఘనంగా ప్రారంభించామని, ఇప్పటివరకు సహస్ర కాలేజ్ నగరంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ ఫార్మేషన్ డే కాలేజీ తరపున నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహస్ర కాలేజ్ డైరెక్టర్ సత్య శ్రీ మానేపల్లి, డైరెక్టర్స్ మేళం నరేష్, మేళం బన్ను, ప్రిన్సిపల్ కెవిఎస్.రాజు పాల్గొన్నారు.




దినోత్సవంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, సిబ్బంది

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణ టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతత్వంలో కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలందరికీ వారి వైద్య ఖర్చులకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందించే కార్యక్రమం చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని విధాలా ఆధునీకరించి అధిక శాతం ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను పొందే విధంగా వైద్య రంగాన్ని అభివృద్ధి పరుస్తున్నట్టు చెప్పారు. పెద్దాపురం పట్టణంలో పిపిపి పద్ధతిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దానికోసం స్థల సేకరణను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని మాజీ ఎంపీ, వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత అన్నారు. కొత్తపల్లి ముప్పారపు అచ్చియమ్మ కళ్యాణ మండపంలో శుక్రవారం వైసిపి విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వంగా గీత పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని ఆమె అన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావు చిన్నారావు, జెడ్‌పిటిసి గుబ్బల తులసి కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టు బత్తిన సురేష్ కుమార్, వెంగళ సుబ్బారావు, సర్పంచులు, ఎంపిటిసి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

అబాకస్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పెద్దాపురం


ఇటీవల గుంటూరులో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి అబాకస్-2025 పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు విశేష ప్రతిభతో ప్రశంసా బహుమతులు గెలుచుకున్నారు. పెద్దాపురం విసిఎంఎస్ అబాకస్ అకాడమీలో శిక్షణ పొందిన 8 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకాగా వీరిలో పి.కేశవాదిత్య వర్ధన్‌రెడ్డి, కె.చిద్విలాన్, పి.జయ ఆరాధ్య, జె.జాన్విత ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారని అకాడమీ డైరెక్టర్ విఎన్.రాజు తెలిపారు. ఈ శిక్షణ వల్ల బాలల్లో చిన్ననాటి నుంచి వేగం, ఖచ్చితత్వం, తార్కిక ఆలోచన పెంపొందుతాయన్నారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను తార్కికతతో వేగవంతంగా పరిష్కరించుకునే విధంగా ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షకులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఐ ఫోర్ ఐ ఆసుపత్రిలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని సూరంపేట ఏరియా రామాలయం వద్ద శుక్రవారం పిఠాపురం ఐ ఫోర్ ఐ కంటి ఆసుపత్రి వైద్యులు ఎన్ఎం.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో అనేక మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అతి తక్కువ ఖర్చుతో కళ్ళజోళ్లు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో వైద్యులు కొప్పిశెట్టి ఉమాదేవి, సిబ్బంది చింతపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జెండర్ వివక్ష నివారణపై అవగాహన

ప్రజాశక్తి-తాళ్లరేవు

మహిళలు, బాలలు హింసలకు గురైనప్పుడు తప్పనిసరిగా చట్టాన్ని ఆశ్రయించాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో శుక్రవారం జెండర్ ఆధారిత హింస, మహిళలు, బాలలపై హింసలకు వ్యతిరేకంగా గ్రామ సమాఖ్య సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్ఐ పి.సత్యనారాయణ మాట్లాడారు. మహిళలు, బాలలు హింసలకు గురైన పరిస్థితుల్లో చట్టాన్ని ఆశ్రయించిన తక్షణమే త్వరితగతిన న్యాయం చేకూర్చడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ రెండు జిల్లాలకు చెందిన ఆరు మండలాల్లో మహిళలు బాలలపై హింసలకు వ్యతిరేకంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు ఐసిడిఎస్ ప్రాజెక్టు గాడిమొగ, ఇంజరం సెక్టార్ల పర్యవేక్షకులు పి.కనకరత్నం, సిహెచ్.నాగలక్ష్మి ఐసిడిఎస్ కార్యక్రమాలను వివరించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చర్యలను వివరించారు.



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న కోరంగి ఎస్ఐ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి

స్టార్ హోటల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్టార్ హోటళ్లు అనేక సమస్యల వలయంలో చిక్కుకున్నాయని, నిర్వహణ భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఎపి స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వి.స్వామి అన్నారు. శుక్రవారం ఆయన కాకినాడలోని ఒక ప్రైవేటు హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానం కొంతమేరకు సంతృప్తిని ఇచ్చినప్పటికీ ఇంకా అనేక సమస్యలు ఉన్నాయన్నారు. రాష్ట్ర అభివద్ధిలో భాగంగా అన్ని ముఖ్య ప్రాంతాలలో మరిన్ని హోటళ్లు ఆతిథ్య రంగంలో రానున్నాయన్నారు. కొత్త హోటళ్లకు రాయితీలు ఇస్తున్న నేపథ్యంలో పాతవాటికీ వీటిని అమలు చేయాలని ఆయన కోరారు. హోటళ్ల నిర్వహణలో ఇబ్బందులు, అభివృద్ధికి తాము ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే సంఘం సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలవనున్నామని తెలిపారు.

ఆదిత్యలో పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సిఎస్ఇ, ఇఇఇ బ్రాంచ్‌లకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు తమ కర్తవ్యాన్ని, లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాన్నారు. ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చేది విద్య మాత్రమే అన్నారు. ఆదిత్యపై అపార నమ్మకంతో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషి చేస్తుందని, తల్లిదండ్రులు వారి వంతు సహకారం ఆదిత్యకు అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం అన్నారు. విద్యారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తరచు కళాశాలకు వచ్చి వారి విద్యా పరమైన, హాజరు తదితర సమాచారం తెలుసుకోవాలని తెలిపారు. ఆదిత్య నిబంధనలు, హాజరు ప్రాముఖ్యత, వారాంతపు నెలవారీ పరీక్షల వివరాల గురించి కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్ తెలిపారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సతీష్ రెడ్డి

నేరాలు ఘోరాలు

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరు శివారు బహిరంగ ప్రాంతంలో కోడి పందేలు జరుగుతున్నాయని సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం ముందస్తు సమాచారం మేరకు మండల పరిధి గ్రామాల శివారు బహిరంగ ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వివరాలు అందాయన్నారు. దీంతో పోలీసుల గస్తీతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో శుక్రవారం గుమ్మిలేరు శివారు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి, రూ. 3,090 నగదు తో పాటు రెండు కోళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ అన్నారు.

హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

ప్రియురాలిని అత్యంత కిరాతంగా హత్య చేసిన ప్రియుడును పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను రాజోలు సీఐ టివి.నరేష్ కుమార్ వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీ రాత్రి బి.సావరం సిద్ధార్థ నగర్ రెండవ వీధిలో తల్లి, నాలుగేళ్ల కుమారుడుతో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్న ఒలేటి పుష్పను రాజోలు కోళ్ల వారి వీధికి చెందిన షేక్ షమ్మా చాకుతో పొడిచి చంపాడని, అడ్డు వచ్చిన తల్లి, సోదరుడి పైనా చాకుతో దాడి చేశారని అన్నారు. మృతురాలికి వివాహమై భర్తతో గొడవల కారణంగా విడిపోయిందని అన్నారు. షేక్ షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడి ఏడాది కాలంగా సహజీవనం చేస్తున్నారని అన్నారు. చెడు అలవాట్లకు బానిస అయిన షమ్మా డబ్బుల కోసం మృతురాలి పుష్పను కొట్టేవాడని అన్నారు. బుధవారం రాత్రి పుష్ప కంప్యూటర్ క్లాస్ అని అమలాపురం తీసుకువెళ్లి తిరిగి వచ్చేటప్పుడు బోడసకుర్రు బ్రిడ్జి పై ఆపి పుష్పతో డబ్బులు గురించి గొడవ పడి కొట్టాడని అన్నారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత రాత్రి 10.30 సమయంలో మృతురాలి తల్లి, సోదరుడు వినాయక్ కలసి పుష్పను ఎందుకు కొట్టావు అని షమ్మాను అడగగా మీరు ఎవరు నన్ను అడగడానికి అని కబోర్డులో ఉన్న చాకుతో వారిపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన పుష్ప ఎడమ వైపు గుండెపై చాకుతో పొడవుగా విపరీతంగా రక్త స్రావమై అక్కడిక్కడే చనిపోయిందన్నారు. మృతురాలి తల్లి గంగ ఫిర్యాదు మేరకు కేసు మేరకు కేసు నమోదు చేశారన్నారు. కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ పర్యవేక్షణలో రెండు టీమ్ లు ఏర్పాటు చేసి రాజోలు సిఐ నరేష్ కుమార్, ఎస్ఐ బి. రాజేష్ కుమార్ తమ సిబ్బంది తో కలసి గంటల వ్యవధిలో నిందితుడు షమ్మా ను అరెస్టు చేసి కేసును చాకచక్యంగా ఛేధించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్డులో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉన్నప్పటికీ విద్యుత్ తీగలకు సరఫరా రావడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. హర్ష లిమిటెడ్ కంపెనీకి సంబంధించి పిఠాపురం రోడ్డు విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ లైన్ మార్పు పనులు చేపట్టారు. కొందరు ప్రైవేటు కార్మికులు విద్యుత్ స్తంభంపై వున్న వైర్లను మారస్తుండగా విద్యుత్ లైన్ వైరు తెగిపడి 11 కెవి వైరుపై పడడంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి స్తంభంపై పనిచేస్తున్న సామర్లకోట గణేష్ కాలనీకి చెందిన నులక బేతాలు (32)కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలో బేతాలు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై సిఐ ఎ.కృష్ణ భగవాన్ దర్యాప్తు చేస్తున్నారు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై శుక్రవారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లింగంపర్తిలోని శ్రీకనక మహాలక్ష్మి ఎరువులు విత్తనాలు దుకాణంలో నిలువల వ్యత్యాసాలు, సరైన పత్రాలు లేని పురుగు మందులను అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో 15,725 మెట్రిక్ టన్నులు వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.1,18,503 ఉంటుందని అధికారులు తెలిపారు. దుకాణదారుడుపై 6 ఎ కేసు నమోదు చేశామన్నారు.

రికార్డుల్లేని బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

కాట్రావులపల్లిలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు వారి సిబ్బంది శుక్రవారం ప్రత్యేక బలగాలతో కలిసి కార్డెన్ అండ్ చర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్‌లో రికార్డ్స్ లేని 13 బైక్స్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాటిపర్తి పెద్ద రామాలయం వీధిలో ఉండే అమరాది శ్రీనివాస్ (39) బైకు పైనుంచి కింద పడ గాయపడ్డాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం మృతి చెందాడు. దీనిపై గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె సహా మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం గ్రామానికి చెందిన సబ్బితి మునికన్య, కుమార్తె సృజనతో కలిసి అదృశ్యమైంది. ఈ నెల 17న కుమార్తె కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె భర్త సబ్బితి కృష్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వారి ఆచూకీ లభించలేదు. ఆచూకీ తెలిస్తే 9440904829, 9440904832 నెంబర్లకు సమా చారం ఇవ్వాలని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

యానాం వార్తలు

28న కొబ్బరి చెట్ల వేలంపాట

ప్రజాశక్తి - యానాం

స్థానిక మత్స్యశాఖ కార్యాలయం పరిధిలో ఉన్న 67 కొబ్బరి చెట్లుకు రెండేళ్ల కాల వ్యవధితో బహిరంగ వేలం పాట ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య తెలిపారు. దానికోసం ప్రాంతీయ పరిపాలనాధికారి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మత్స్య శాఖకు వచ్చి అదే రోజున ఉదయం 9 గంటల నుండి 10 గంటల కాల వ్యవధిలో రూ.వెయ్యి చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - యానాం

విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉషా బాను విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ టిఎ బాలరాజు స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఒడి వివిఎల్ పి.రాజు, కనకాల తాతారావు, పి.రాంబాబు, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను సంబంధిత అధికారులతో కలిసి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణపై ఆరా తీశారు. స్విమ్మింగ్ పూల్ మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు, సాయ్ స్పోర్ట్స్ ఇంచార్జి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు, పండ్ల మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

కంభంపాటి నవ్య జన్మదిన సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ పెద్దాపురం న్యూ జెన్ క్వీన్స్ ఆధ్వర్యంలో సమకూర్చిన కుర్చీలు, పండ్ల మొక్కలు శుక్రవారం స్థానిక గొరికోనేరు కాలనీలోని భారతి మున్సిపల్ పాఠశాలకు ట్రైనీ డిఎస్‌పి సిహెచ్.జీవన అందజేశారు. ఈ సందర్భంగా జీవన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాక ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్, బోడా చరణ్, హెచ్‌ఎం సిహెచ్.సన్యాసి రెడ్డి, ఉపాధ్యాయులు బి.రమాదేవి, ఇన్నర్ వీల్ న్యూ జెన్ క్వీన్స్ ప్రెసిడెంట్ సూరే శ్రీకరి, సెక్రటరీ తాళ్లూరి మేఘన, కంభంపాటి నవ్య, కోశాధికారి శ్రీకాకుళపు అఖిల, సాదే జయశ్రీ, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు సూరే సింధూర తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పథకం ప్రారంభం

ప్రజాశక్తి -కరప

గొర్రిపూడిలో జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పథకాన్ని శుక్రవారం ఎంఎల్‌ఎ పంతం నానాజీ ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.58.50 లక్షలతో చేపట్టిన ఈ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. గ్రామానికి మంచినీటి కొరత గత కొన్ని సంవత్సరాల నుంచి వేధిస్తూ ఉన్నదని ఆ సమస్య ఇప్పుడు తీరిందని ఆయన పేర్కొన్నారు. గొర్రెపూడి గ్రామాన్ని నిధులు వెచ్చించి అభివద్ధి చేస్తున్నామని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానూరు రమాదేవి, ఎంపిటిసి పుణ్యమంతుల అన్నవరం, అనుకుల రాంబాబు, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబ, ఎఎంసి చైర్మన్ ముద్రగడ రమేష్, నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు, గండి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ అనుపమ, తహశీల్దారు దుర్గాప్రసాద్, గోవిందు, పేకేటి దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రధానమంత్రి సూర్యగర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కమిషనర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ మీటింగ్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తమ ఇంటి పైకప్పులపై సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్ పొందడమే కాక మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ పోను మిగిలిన ఖర్చు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు అందుకే ఇస్తాయని తెలిపారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోనలో నకిలీ విత్తనాల బారినపడి రైతులు లబోదిబోమంటున్నారు. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని వెంకమ్మ చెరువు గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు కాట్రేనికోనలోని ఒక ప్రముఖ ఎరువుల దుకాణంలో భారతి కంపెనీ విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క బస్తా ధర రూ 1300 చొప్పున చెల్లించారు. మొలకలు సరిగా రాకపోవడంతో నిరాశ చెందారు. దీంతో సదరు డీలర్ను నిలదీశారు. వేరే కంపెనీ బస్తాలు ఇప్పిస్తానని ఆయన చేతులు దులుపుకున్నాడు. చేలో వచ్చిన కొద్దిపాటి మొలకల్ని బాధిత రైతులు తొలగించారు. ఇప్పటికే నారు వేయటం చాలా ఆలస్యమైందని, మరలా విత్తనాలు తెచ్చి చల్లిన తర్వాత మొలకలు వస్తాయో లేదోనని వీరు ఆందోళన చెందుతున్నారు. నకిలీ విత్తనాల విషయం బయటకు పొక్కడంతో సరఫరాదారులు హడావుడిగా బాధితుల దగ్గరకు వెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని బాధిత రైతుల్లో కొంతమంది పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి మృదులను వివరణ కోరగా ఇటువంటి ఫిర్యాదు రైతుల నుంచి తనకు అందలేదన్నారు. అయినప్పటికీ ఈ విషయమై తన సిబ్బందికి సూచనలు చేశారన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తాగు నీటిని కలుషితం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తాగు నీటిని కలుషితం చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన సామర్లకోట రహదారిలో పెద్దాపురం గోదావరి మంచినీటి సరఫరా పైపులైను పరిశీలిస్తుండగా కోళ్ల మందుల ఉత్పత్తి కేంద్రం సమీపంలో ఎయిర్ పైపులైన్‌పై లీకేజీ కారణంగా బయటికి వస్తున్న నీటితో కొందరు లారీలు క్లీన్ చేస్తున్నారని చెప్పారు. ఈ క్లీన్ చేసిన నీరు మళ్లీ వాల్వు ద్వారా తాగు నీటిలో కలిసి కలుషితం అవుతోందన్నారు. నీటిని కలుషితం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాల్వు రిపేరు పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కాజులూరు

సీజనల్ వ్యాధుల్లో భాగంగా ఈ వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ జె.రాంబాబు కోరారు. శుక్రవారం మండలంలోని జగన్నాథగిరిలో పారిశుధ్య పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందిని ఉద్దేశించి ఎంపిడిఒ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ఎక్కడికక్కడ పారిశుధ్యాన్ని పరిశీలించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం ద్వారా కొంతవరకు వ్యాధుల నిర్మూలనకు అవకాశం ఉంటుందని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త కలిపి ఉండడంవల్ల భూములు ఎక్కడకక్కడ దుర్వాసనతో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాస్ సిబ్బంది చంటి, సచివాలయ ఉద్యోగులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి-కాకినాడ

అంగన్‌వాడీల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి మాట్లాడుతూ ఐసిడిఎస్ పెట్టి 50 ఏళ్లు పూర్తయినా అంగన్‌వాడీలకు ఏ బెనిఫిట్స్ అందడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరికీ ఆధార్ కార్డ్‌ల ఆధారంగా రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాప్‌లలో వర్కులు చేస్తూ పిల్లలకు బోధనకు సమయం ఉండటం లేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా నాయకులు ఎంకె.జ్యోతి, వీరమణి, సెక్టార్ నాయకులు వరలక్ష్మి, కనకలక్ష్మి పాల్గొన్నారు.

సేవ్ ది పీపుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం

సేవ్ ది పీపుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్ నందు డిఆర్ఒ రాజకుమారి చేతుల మీదుగా రూ.20 వేలు చెక్కును విద్యార్థి తల్లికి అందజేారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాజకుమారి మాట్లా డుతూ రాజోలు గౌతమ్ మోడల్ స్కూల్లో ఏడోవ తరగతి విద్యను నభ్యసిస్తున్న గెద్దాడ భారత్ కుమార్, తొమ్మిదవ తరగతి చదు వుతున్న మానస విద్యార్థులకు సేవ్ ది పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఫీజు నిమిత్తం చెక్కును అందించారన్నారు. విద్యార్థి తండ్రి కరోనాతో మరణించడంతో కుటుంబం ఆర్థికంగా దెబ్బతిందని ట్రస్ట్ సభ్యులు గుర్తించి పిల్లలకు చదువు నిమిత్తం ట్రస్ట్ సహ కారంతో ఆర్థిక సాయం అందించారన్నారు. సేవ్ ది పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 36 మంది పేద విద్యార్థులను భవిష్య త్తును తీర్చిదిద్దాలని సంకల్పంతో సంస్థ చేస్తున్న కషి అభినందనీయమ న్నారు. కార్యక్రమంలో సేవ్ ది పీపుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుంకర సుధీర్, ట్రస్ట్ సభ్యులు మానస సుప్రియ, నవ్య, నాగ దుర్గా, రాజు పాల్గొన్నారు.

పొలాల ముంపును నివారించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఏలేరు నుంచి పంట నీరు ఎక్కువ విడుదలైనపుడు పంట పొలాలు మునిగిపోకుండా తిరుపతి గ్రామం వద్ద ఏలేరు కాలువపై రిగ్గు ఏర్పాటు చేయాలని చంద్రమాంపల్లి టిడిపి నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకటరావు శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంఎల్ఎ స్పందిస్తూ వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఇరిగేషన్ డిఇని ఆదేశించారు. జి.రాగంపేటలోని భాస్కర్ కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో వర్షం పడిందంటే కాలనీ అంతా బురదమయంగా మారిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని మార్కెట్ కమిటీ డైరెక్టర్ జలదాని సుబ్రహ్మణ్యం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రెన్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

పంట బీమా నమోదుకు ఆగస్టు 15 గడువు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ సీజన్లో రైతులు వరి పంటకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన నమోదుకు ఆగస్టు 15 గడువు అని మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళి తెలిపారు. జిల్లాలో వరి పంటకు బీమా కోసం నమోదు చివరి ఆగస్టు 15 తేదీగా నిర్ణయించారన్నారు. ఈ పథకం అమలుకు ఎస్‌బిఐ జనరల్ ఇన్స్యూరెన్స్ సంస్థను నియమించగా, రైతులు 5 మార్గాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

డ్రెయినేజీ పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక చల్లా వారి పుంత రహదారి నుండి సత్తమ్మ పేట, వరహాలయ్య పేట, శోభా థియేటర్ వీధి మీదుగా వర్షపు నీరు, మురుగునీరు ప్రవహించే పెద్ద డ్రెన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఇంజినీరింగ్, సానిటరీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ డ్రైన్ తరచుగా పూడుకు పోవడం వల్ల మురుగునీరు ప్రవహించక నివాస ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఈ డ్రెన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఈ డ్రెన్ కొంత భాగం కచ్చా డ్రెనుగా నిర్మించటం వల్ల తరచుగా మట్టి వర్షపు నీరు, మురుగు నీటితో కలిసి ప్రవహించి డ్రెనులో అక్కడక్కడా మట్టి పేరుకుపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. ఈ కచ్చా డ్రెన్ స్థానంలో సిమెంట్ డ్రెన్ నిర్మించేందుకు ఎస్టిమేషన్లు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పివి.సుధాకర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, బొడ్డు ప్రకాష్ పాల్గొన్నారు.

రత్నగిరిపై ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నెయ్యి డబ్బాలు తస్కరించిన సంఘటనపై ఇద్దరిని సస్పెండ్ చేసినట్టుయ ఇఒ సుబ్బారావు తెలిపారు. దీనికి సంబంధించి సత్యదేవుని ఉపాలయంగా ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉప ప్రధాన అర్చకునిగా పనిచేస్తున్న చిట్టెం హరగోపాల్, సంభావన పరిచారికుడు నూకల కృష్ణ ఆలయం నుంచి 15 కేజీల ఆవు నెయ్యి డబ్బాలను కారులో తరలించిపోతుండగా సెక్యూరిటీ అధికారి ఆలయ అధికారి పట్టుకుని ఇఒకు సమాచారం అందించారు. దీంతో ఇఒ వారిద్దరినీ సస్పెండ్ చేశారు

సామర్లకోట ఎఎంసి చైర్‌పర్సన్‌గా మణికుమారి

ప్రజాశక్తి - సామర్లకోట



సామర్లకోట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పట్టణానికి చెందిన అందుగుల మణి కుమారి నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఎస్‌సి మహిళా విభాగంలో మణి కుమారిని మార్కెట్ కమిటీ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె భర్త అందుగుల జార్జి చక్రవర్తి సీనియర్ టిడిపి నాయకుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యునిగా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ ఏర్పడిన తరువాత సామర్లకోటకు చెందిన వారికి చైర్మన్ పదవి దక్కడం ఇదే మొదటిసారి.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగంపై స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మకాల జరిపే వ్యాపారస్తులతో కూడా సమావేశం నిర్వహించి వీటిని అమ్మకుండా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ శ్రీరమణి

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి శుక్రవారం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. పూజ లు అనంతరం వేద ఆశీర్వచనాలతో అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ శుక్రవారం అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించామన్నారు. ఈ పూజా కార్యక్రమాలలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్ రమణ, వరహాలు, శివ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ గ్రామ స్థాయి కమిటీదే

ప్రజాశక్తి - జగ్గంపేట

గ్రామస్థాయిలో ఉన్న తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించి వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత గ్రామస్థాయి కమిటీదేనని ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పూర్ణిమ అన్నారు. శుక్రవారం మండలంలోని జె.కొత్తూరు, రాజపూడి, రామవరంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చైర్పర్సన్‌గా, మహిళా పోలీసు కన్వీనర్‌గా ఉంటూ 11 మంది సభ్యులను గ్రామంలోని వారిని పెట్టి కమిటీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సూపర్‌వైజర్ అమ్మాజీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి - మండపేట

అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కోనసీమ జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండపేట తహశీల్దార్ కార్యాలయం మీటింగ్ హాలులో మండపేట తాలూకా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. తాలూకా అధ్యక్షులు ఎంవివిఎన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపూజీ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ డిఎలు, పిఆర్‌సి కమిషనర్ ఏర్పాటు, ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల పై ఈనెల 25, 26 తేదీలలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కాశీభట్ల రామసూరి నారాయణ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉద్యోగుల కీలక నిర్ణయాలు చేయనున్నటు తెలిపారు. ఉద్యోగులు అధైర్యం పడవద్దని ఎపిజిఇఎ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం హామీ అమలు కు రాష్ట్రంలో వివిధ ఉద్యోగ సంఘాల తరపున సూర్యనారాయణ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారనితెలిపారు. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లాలోని అన్ని తాలూకాలలో ఎపిజిఇఎ సమావేశాలు జరిపి నూతన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని బాపూజీ పిలుపునిచ్చారు.

అనారోగ్యంతో ఉన్న యువతికి సాయం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఏలూరు గ్రామానికి చెందిన యువతి దేవికి మణికర్ణిక టీము దాతల నుంచి సేకరించిన రూ.20 వేల చెక్‌ను శుక్రవారం అందించారు. చెన్నైలో దేవికి చికిత్స చేస్తున్నారని, దాతల సాయంతో ఆమెకు మెరుగైన వైద్యం ఇప్పించగలుగుతున్నామని వారు తెలిపారు. సహాయం చేసిన అందరికీ గున్నాబత్తుల పూజా అనూష ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగలంక శ్రీను, వీరబాబు, మణికంఠ, రమేష్, నాని, గని పాల్గొన్నారు.